క్లుప్తంగా

మాజీ కౌన్సిలర్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: మాజీ కౌన్సిలర్ తిరుమలశెట్టి శ్రీరాములు(70) అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం కన్ను మూశారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. రెండుసార్లు టీడీపీ కౌన్సిలర్‌గా సేవలందించిన ఈయన పేరుతో కడపలో శ్రీరాములు బజార్ అనే వీధి ఉంది. 2024 ఎన్నికలకు ముందు వైఎస్సార్‌సీపీలో చేరారు. శ్రీరాములు చనిపోయిన విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా ఆయన స్వగృహానికి వెళ్లి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సుభాన్ బాషా, డా.సొహైల్, మాజీ డిప్యూటీ మేయర్ అరీఫుల్లా నివాళులర్పించారు. దాసరి శివప్రసాద్, శివకేశవ, జిలాన్, బన్నా పాల్గొన్నారు.

అధ్యాపకురాలికి డాక్టరేట్



పట్టా అందుకున్న శివజ్యోతి

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన విశ్వవిద్యాలయం ఎంసీఏ విభాగంలో కంప్యూటర్ సైన్స్ అధ్యాపకురాలిగా పనిచేస్తున్న సిద్ధవటం శివజ్యోతికి రాయలసీమ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. తిరుపతి ఎస్వీయూ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం ఆచార్యులు డాక్టర్ ఎ.రామమోహన్‌రెడ్డి పర్యవేక్షణలో ‘జనరేషన్ ఆఫ్ ర్యాండమ్ ఫీల్డ్స్ ఫార్ ఇమేజ్ ఎన్‌హాన్స్‌మెంట్ అండ్ సెగ్మెంటేషన్’ అంశంపై ఆమె చేసిన పరిశోధనకు రాయలసీమ విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్ విభాగంలో ఈమెకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈమె కడప నగరం పాతకడపకు చెందిన కే.శే.ఎస్. సూర్యచంద్రారెడ్డి, ఎస్.రమాదేవిల కుమార్తె. ఈమె భర్త డాక్టర్ ఎల్.వీరాంజనేయరెడ్డి వైవీయూలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

జిల్లా కన్వీనర్‌గా మధు



మధు

కడప ఎడ్యుకేషన్: ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక జిల్లా కన్వీనర్‌గా పెనుబడి మధు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కడప ప్రెస్‌క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు మంచాల రామకష్టారెడ్డి, సుదర్శన్‌నాయుడు, శివరావ్ ప్రసాద్ మధును ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక తరఫున పోరాటాలు నిర్వహిస్తామని వారు తెలిపారు.

సాహితీ వెలుగునందించిన కవి జ్యోత్స్న

కడప ఎడ్యుకేషన్: తన కలంతో సాహితీ వెలుగునందించిన సాహితీవేత్త, కవి శుభ్రజ్యోత్స్న(యెద్దల గంగయ్య) అని నాగిరెడ్డిపల్లె ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగనపల్లె వెంకటరమణ అన్నారు. వైవీయూలోని సిపీ.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో నెలనెలా సీమ సాహిత్యం సదస్సులో భాగంగా శుభ్రజ్యోత్స్న(యెద్దల గంగయ్య) జీవిత సాహిత్యం కార్యక్రమం నిర్వహించారు. వెంకటరమణ మాట్లాడుతూ శ్రీరామ కథామృతం, తెలుగు బిడ్డ శతక పద్యాలు, అన్నమయ్య బాటలో వేంకటేశ్వరస్వామి పాటలు, అనేక చరనలు శుభ్రజ్యోత్స్న కలం నుంచి వెలువడ్డాయన్నారు. సంక్రాంతికి స్వాగతం లాంటి పలు పద్యకవితలను ఆమె వెలువరించారన్నారు. అనంతరం డా.చింతకుంట శివారెడ్డి, డా.భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, ఎస్.రమేశ్‌రావు, ఆర్.వెంకటరమణ, ఎం.మౌనిక, సిబ్బంది, కలిసి వక్త వెంకటరమణను శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నందకిశోర్, చెంచురెడ్డి, పశ్శె విజయకుమార్, శ్యామసుందర్‌రెడ్డి, రమణమూర్తి, వెంకటరమణ పాల్గొన్నారు.

28న సర్వసభ్య సమావేశం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: సెప్టెంబర్ 28న కడప తెలుగుగంగ కాలనీ వద్ద గల రైల్వే ప్లాట్లలో కడప జిల్లా రైల్వే ఎంప్లాయీస్ కో ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు ఎం.సుబ్బరాయుడు తెలిపారు. సర్వసభ్య సమావేశానికి కమిటీ సభ్యులు అందరూ హాజరుకావాలని, అక్కడే సొసైటీ డెవలప్‌మెంట్ కొరకు సూచనలు ఇవ్వాలని కోరారు.

సైన్స్‌తోనే సమాజం అభివృద్ధి

ప్రొద్దుటూరు కల్చరల్ : సైన్స్ అభివృద్ధితోనే సమాజం అభివృద్ధి చెందుతుందని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు తెలిపారు. స్థానిక నందినీ క్లాత్ మార్కెట్‌లోని జనవివిజ్ఞాన వేదిక కార్యాలయంలో ఆదివారం జేవీవీ జిల్లా మహాసభలను నిర్వహించారు. జాతీయ జెండాను రిటైర్డ్ ఎంఈఓ గడియారం వెంకటేశ్వర్లు, జేవీవీ జెండాను డాక్టర్ నరసింహారెడ్డి ఎగురవేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్టికల్ 51ఎ(హెచ్) అమలు చేసి ప్రజలకు శాస్త్రీయ విజ్ఞానం అందించాలన్నారు. శాస్త్ర విద్యావిధానం కోసం బడ్జెట్‌లో ప్రత్యే నిధులు కేటాయించాలన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా మాట్లాడుతూ పాలక వర్గాలు సాంస్కృతిక దోపిడీ చేస్తున్నారన్నారు. కార్యక్రజుమంలో డాక్టర్ డి.నరసింహారెడ్డి, డాక్టర్ రాజా వెంగళరెడ్డి బాలబయన్న, తవ్వా సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఏకదంతాయ.. బహురూపాయ

ఆది పూజలందుకున్న దేవుడు గణపతి నిమజ్జనం కడప నగరంలో ఐదో రోజైన ఆదివారం ఘనంగా కొనసాగింది. చతుర్థి రోజైన బుధవారం నగరంలో వినాయక విగ్రహాలను పెద్ద సంఖ్యలో కొలువుదీర్చారు. ఐదో రోజైన భక్తుల కోలాహలం మధ్య నిమజనోత్సవం వైభవంగా నిర్వహించారు. యువతీ, యువకులు, చిన్నా, పెద్దా తేడా లేకుండా ఉత్సవాల్లో పాల్గొని రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. పలుచోట్ల అన్నదానం చేపట్టారు.

- గణనాథుడికి ఘనంగా వీడ్కోలు
- వెల్లువెత్తిన నిమజ్జనోత్సాహం



గంగమ్మ ఒడికి చేరిన గణనాథుడు



కోలాట ప్రదర్శన

కడప సెవెన్‌రోడ్స్: చూసేందుకు మట్టి విగ్రహంగా కనిపించినా ఆధ్యాత్మికంగా మాత్రం బ్రహ్మ స్వరూపమైన మృత్తిక ప్రతిమను నిమజ్జనం చేయడమంటే ఆత్మను పరమాత్మలో ఐక్యం చేయడమే. వినాయక ప్రతిమలను నీటిలో నిమజ్జనం చేస్తే విగ్రహం తిరిగి మట్టిలో కలుస్తుంది. నిమజ్జనం వెనుక ఇంత విషయం దాగుంది కనుకే అనాదిగా నిమజ్జన కార్యక్రమాలు సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నారు. కడప నగరంలో వైభవంగా నిర్వహించారు. 1, 2 భారీ విగ్రహాలు మినహా ఓ మోస్తరు నుంచి పెద్ద విగ్రహాల వరకు నిమజ్జనానికి తరలించారు. అంతకు మునుపు మండపాల వద్ద నిర్వాహకులు, భక్తులు భారీ స్థాయిలో అన్నప్రసాదం పంపిణీ చేపట్టారు. నగర సమీపంలోని కేసీ కెనాల్, చెన్నూరు, సిద్దవటం వద్ద పెన్నానదిలో ఎక్కువశాతం పెద్ద విగ్రహాలను నిమజ్జనం చేశారు. నగరానికి చెందిన ఎక్కువ విగ్రహాలను పాతకడప చెరువుకు తరలించారు. పోలీసులు, అగ్నిమాపక, విద్యుత్, మున్సిపల్ సిబ్బంది పకడ్బందీ చర్యలు చేపట్టడంతో నిమజ్జనాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదు. యువత ఉత్సాహంగా ట్రాక్టర్లు, పెద్ద లారీలలో విగ్రహాలను తరలించారు. నృత్యాలు చేస్తూ ఊరేగింపులో యువత పాల్గొన్నారు.

కడప కార్పొరేషన్: కడప నగరంలోని 22వ డివిజన్ మారుతీ నగర్‌లో వినాయక నిమజ్జనం ఘనంగా జరిగింది. ఆదివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించిన నిర్వాహకులు, ఆ తర్వాత గణేషుడిని మేళతాళాలు, నృత్యాల నడుమ నిమజ్జనానికి తరలించారు. రంగులు చల్లుకుంటూ సంబరాలు చేసుకున్నారు. రామచంద్రయ్య, సభ్యులు పాల్గొన్నారు.



బాలాజీ నగర్‌లో గణేష్ నిమజ్జన ఊరేగింపులో యువత



వినాయక ఊరేగింపును కెమెరాలో బంధిస్తున్న యువతులు



మారుతీనగర్‌లో నిమజ్జనానికి తరలిన గణేశుడి వద్ద స్థానికుల సందడి



రాజీవ్‌మార్గ్‌లో అన్న ప్రసాదం స్వీకరించేందుకు బారులు తీరిన జనం



రాజీవ్ పార్కు వద్ద యువత కోలాటం



రాజారెడ్డి వీధిలో వినాయక ప్రతిమ ఊరేగింపు



ఊరేగింపును వీక్షిస్తున్న జనం

ఐక్యత పెంచుతాయి



నాగరాజుపేటలో అన్నప్రసాదం పంపిణీలో పాల్గొన్న ఉమేర్

కడప సెవెన్‌రోడ్స్: పండగలు ప్రజల మధ్య ఐక్యతను పెంచుతాయని జిల్లా పరిషత్ చైర్మన్ ముత్యాల రామగోవిందరెడ్డి అన్నారు. కడప రాజీవ్ మార్గ్‌లో ఏర్పాటుచేసిన భారీ విగ్రహ నిమజ్జన కార్యక్రమం ఆదివారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని జెడ్పీ చైర్మన్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మతాలకు అతీతంగా ప్రజలు కార్యక్రమంలో పాల్గొనడం అభినందనీయమన్నారు. సంఘమిత్ర కన్‌స్ట్రక్షన్స్ అధినేత వి.మధుకర్‌రెడ్డి, వీవీఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత వంశీనాథరెడ్డి, ధర్మకర్త దేసువెంకటరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ఎం.బాలకృష్ణారెడ్డి, వెంకటరెడ్డి, శ్రీరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

నాగరాజుపేటలో

స్థానిక నాగరాజుపేట మురళీ థియేటర్ సమీపంలో ఏర్పాటుచేసిన గణేష్ విగ్రహాన్ని ఆదివారం నిమజ్జనానికి తరలించారు. గణపతి బొప్పా మోరియా... బోలో జై గణేష్ మహరాజీకి జై...అంటూ యువత పెద్దఎత్తున నినాదాలు చేశారు. అంతకుముందు అన్నదానం చేశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి ఉమేర్, ఐస్‌క్రీమ్ రవి, విజయలక్ష్మి, సుబాన్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ విద్యా సంస్థల సమస్యలను పరిష్కరించాలి



ఐక్యత చాటుతున్న అసోసియేషన్ నాయకులు

కడప రూరల్: ప్రైవేట్ విద్యా సంస్థల సమస్యలను పరిష్కరించాలని ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్(అప్స) రాష్ట్ర అధ్యక్షుడు సుబ్రమణ్యంరాజు తెలిపారు. స్థానిక స్థానిక చలమారెడ్డిపల్లెలోని హిల్స్ వ్యాలీ హాల్‌లో ఆదివారం అప్స జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సుబ్రహ్మణ్యంరాజు మాట్లాడుతూ 40ఏళ్ల కిందట అసోసియేషన్ ఏర్పాటుచేసి అనేక సమస్యలను పోరాడి సాధించుకున్నామన్నారు. రాష్ట్ర కౌన్సిల్ సలహాదారు సుందర్‌రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సొంత, టూరిస్టు వాహనాల కాల పరిమితిని 15నుంచి 25 సంవత్సరాలకు పెంచిందని, ప్రైవేటు స్కూళ్ల వాహనాలకు అదే స్థాయిలో కాలపరిమితి పెంచాలని కోరారు. గ్రీన్ ట్యాక్స్ తగ్గింపుపై ఆర్డినెన్స్ ఇచ్చారు గానీ ఉత్తర్వులు ఇంకా ఇవ్వలేదన్నారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా సుధాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా అనిల్‌కుమార్‌రెడ్డి, కోశాధికారిగా సంజీవరావులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో భాస్కరరావు, జనార్దనరావు, రామకృష్ణారెడ్డి, తేజస్విని, కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

కడపలో బ్రాహ్మణ భవన్ ఏర్పాటుచేయాలి



మాట్లాడుతున్న ఇసుకపల్లి కామేశ్వరప్రసాద్

కడప సెవెన్‌రోడ్స్: కడప నగరంలో తక్షణమే బ్రాహ్మణ భవన్ నిర్మించాలని ఏపీ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఇసుకపల్లి కామేశ్వర ప్రసాద్ కోరారు. నగరంలోని డాక్టర్ గోపీనాథ్ క్లినిక్ ప్రాంగణంలో ఆదివారం సమాఖ్య కార్యవర్గ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం బ్రాహ్మణ అభ్యున్నతికి కృషి చేయాలని, అన్ని బ్రాహ్మణ సంఘాలు కలిసికట్టుగా ఇందుకు పాటుపడాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకుని ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఏపీ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య జిల్లా అధ్యక్షుడిగా ఎస్వీ.రమణ, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఎస్వీ.నాగేంద్రప్రసాద్, కార్యదర్శిగా అవధానం శ్రీనివాస్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి వేదం హరిప్రసాద్, గాలి శ్రీనివాసరావు, శివరాంప్రసాద్, డాక్టర్ గోపీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతో డీఎస్సీ అభ్యర్థులకు కష్టాలు

కడప ఎడ్యుకేషన్: డీఎస్సీ పరీక్షలో ఉత్తీర్ణులై నియామకాల కోసం వేచి ఉన్న అభ్యర్థులు విద్యాధికారుల చర్యలతో కష్టాలు పడుతున్నారని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి అన్నారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్, ఇతర విషయాలపై జిల్లా స్థాయి అధికారులకు ఏమాత్రం సమాచారం లేదని, ప్రతి విషయం ఉన్నతాధికారుల సూచనలతోనే జరుగుతోందని చెప్పారు. డీఎస్సీ అంటే డిస్ట్రిక్ సెలక్షన్ కమిటీనా లేక డైరెక్టరేట్ సెలక్షన్ కమిటీనా అనే అనుమానం వస్తోందన్నారు. కాల్‌లెటర్ల డౌన్‌లోడ్ నుంచి ధ్రువపత్రాల పరిశీలన వరకూ అభ్యర్థులకు సూచనలు లేకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారని చెప్పారు. అనంతపురం జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ సోషల్ స్టడీస్ అభ్యర్థుల ధ్రువపత్రాలు పరిశీలించిన అధికారులు మరుసటి రోజు ఫోన్ చేసి అభ్యర్థులు మళ్లీ హాజరుకావాలని చెప్పడంతో నానా కష్టాలు పడుతూ రెండో రోజు కూడా వచ్చారన్నారు. ఎహనానికి పరీక్ష పెడుతూ అధికారులు తీసుకుంటున్న నిర్ణయాలు ఇబ్బంది పెడుతున్నాయన్నారు.

ఉపాధ్యాయ నియామకాల మెరిట్ జాబితా ఇవ్వాలి



మాట్లాడుతున్న రామాంజనేయులు

కడప ఎడ్యుకేషన్: డీఎస్సీ-2025 నియమాకాల మెరిట్ జాబితా సబ్జెక్టు వారీగా ప్రకటించాలని ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు డిమాండ్ చేశారు. కడప జిల్లా కార్యాలయంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎలాంటి అనుమానాలకు తావులేకుండా మెరిట్ లిస్టును వదలిన ప్రభుత్వం వివిధ సబ్జెక్టులలో ఎంపికైన అభ్యర్థుల వివరాలను, ఓపెన్ కేటగిరీలో సబ్జెక్టుల వారీ కట్ ఆఫ్ మార్కులను, రిజర్వేషన్ కేటగిరిలో ఎంపికైన ఉపాధ్యాయుల చివరి కటాఫ్ మార్కులను ఉపాధ్యాయుల రోస్టర్‌ను ప్రకటించాలని కోరారు. అభ్యర్థి వ్యక్తిగత లాగిన్‌లో కాల్ లెటర్స్ రావడంతో ఏ సబ్జెక్టులో ఎంత మార్కుల వరకూ ఓపెన్ కేటగిరీలో ఉద్యోగాలు వచ్చాయనేది తెలియడం లేదన్నారు. విద్యాశాఖ అధికారులు స్పందించి ఉపాధ్యాయుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ తర్వాత జిల్లాల వారీగా జాబితా విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్పోర్ట్స్, వికలాంగులకు వేర్వేరుగా ఉద్యోగ నియమాకాల్లో రోస్టర్ పాయింట్ కేటాయించే చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అవుల శ్రీనివాసులు, నంద్యాల రాజగోపాల్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య, బి.చంద్రశేఖర్, లక్ష్మీనారాయణరెడ్డి, జాన్, ప్రసాద్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

గంగమ్మతల్లికి పూజలు

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట గంగమ్మతల్లికి ఆదివారం ఆలయంలో పట్టు వస్త్రాలు, నగలు, గంధం, పసుపు ప్రత్యేక పూలమాలలతో విశేష అలంకరణ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి తమ మొక్కుబడులను, ముడుపులను అమ్మవారికి చెల్లించుకున్నారు. మహిళా భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించుకున్నారు. బంధుమిత్రులతో కలిసి విందు భోజన కార్యక్రమాలలో పాల్గొన్నారు. గంగమ్మదేవాలయం సమీపంలోని వీరభద్రస్వామి, వైద్య నాథీశ్వర ఆలయం, ఆంజనేయస్వామి, సాయిబాబా దేవాలయాలలో భక్తులు పూజలు చేశారు.

ఎమ్మెల్సీ కల్యాణికి సత్కారం



కళ్యాణిని సత్కరిస్తున్న చైతల్య, తదితరులు

కడప కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణికి ఆదివారం ఘన స్వాగతం లభించింది. తొలిసారి జిల్లాకు వచ్చిన ఆమెకు వైఎస్సార్‌సీపీ అంగన్‌వాడీ విభాగం నగర అధ్యక్షురాలు చైతల్య ఆధ్వర్యంలో వెంకటేశ్వరస్వామి జ్ఞాపిక ఇచ్చి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విజయ మనోహరి, జిల్లా అధ్యక్షురాలు టీపీ వెంకట సుబ్బమ్మ, నగర అధ్యక్షురాలు దీప్తి తదితరులు పాల్గొన్నారు.

కోదండరాముడిని దర్శించుకుని...

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆశీస్సులు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ఉండాలని ఎమ్మెల్సీ వరుదు కల్యాణి స్వామివారిని కోరుకున్నారు. ఆదివారం ఆమె శ్రీ కోదండరామస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు ఆలయ లాంఛనాలతో ఆమెకు స్వాగతం పలికి ఆలయ ప్రదక్షిణ గావించి, గర్భాలయంలోని మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు జరిపించారు. ఆలయ రంగమండపంలో సేదతీరిన ఆమెను అర్చకులు, స్థానిక నాయకులు, మహిళా కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్సీ వెంట వైఎస్సార్‌సీపీ రాయలసీమ మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జ్ విజయ మనోహరి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, మండల అధ్యక్షులు టక్కోలు శివారెడ్డి, ఒంటిమిట్ట సర్పంచ్ కత్తి సుజాత, నరవకాటిపల్లి సర్పంచ్ బ్రహ్మానందరెడ్డి, మండల మహిళా విభాగం అధ్యక్షురాలు దొడ్డుపల్లి శ్రీదేవి, నాయకలు రవి రెడ్డి, తుమ్మలపెంట శ్రీనివాసులు, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.